క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం మండలం 11 కేవీ పెద్దిపాలెం ఫీడర్‌లైన్‌లో నిర్వహణ, మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా చందక, పాడుగుపాలెం, వెంకటాపురం, జగన్నాథపురం, గొట్టిపల్లి, కుసులవాడ గ్రామ ప్రాంతాల గృహ, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాగుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



రాగుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండల పరిధి మద్దిలోని రైతు సేవా కేంద్రంలో రాగుల కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ కంటుబోతు రాంబాబు మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీలత మాట్లాడుతూ క్వింటా రాగులకు రూ.4290 మద్దతు ధర ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి, సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ ఎ.మోహనరావు, భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ బి.విజయ ప్రసాద్, ఏవో ఎంపీఎస్ చలం, వైఎస్సార్ సీపీ నాయకుడు బుగత సత్యనారాయణ, టీడీపీ నాయకుడు కాళ్ల నగేష్ కుమార్ పాల్గొన్నారు.

బదిలీ అయిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవోకు సన్మానం

పద్మనాభం: పద్మనాభం మండలం నుంచి ఆనందపురం మండలానికి బదిలీ అయిన ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వరలక్ష్మిని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ తరపున వరలక్ష్మిని ఎంపీపీ కంటుబోతు రాంబాబు దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు కె.నగరపాలెం సోమన్నపాలెం, రెడ్డీలపాలెం, గొల్లల పాలెం ప్రాంతాల గ్రామ దేవత శ్రీ నూకాలమ్మ తల్లి ఆలయ నూతన కమిటీ మంగళవారం ఎన్నికైంది. కమిటీ చైర్మన్‌గా పోతిన అప్పలరాజు, కమిటీ మెంబర్లుగా పోతిన వెంకటేష్, పాల నాయుడు, నారు ఎల్లాజీ, కోడిబోయిన వరహాలు, ఎరుసు అప్పలకొండ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

అనంతుని ఆలయ శిఖర పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పద్మనాభం: అనంతుని ఆలయ శిఖర పునర్నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దేవదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గిరిపై రూ.60లక్షల సీజీఎఫ్ నిధులతో పునర్నిర్మిస్తున్న అనంత పద్మనాభ స్వామి శిఖరం పునర్నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులను వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట ఈవో నానాజీ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కె.రమణ, నాయకులు ఎం.నందీష్, కె.నగేష్ కుమార్ తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మృతి



అప్పల స్వామి(ఫైల్)

పద్మనాభం: మండలంలోని బాందేవుపురం ఎంపీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బాయి అప్పలస్వామి మంగళవారం మృతి చెందారు. విలాస్కాన్‌పాలెం గ్రామానికి చెందిన అప్పలస్వామి మంగళవారం ఉదయం ఇంటి వద్ద అస్వస్థతకు గురవడంతో విజయనగరం ఎమ్మార్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఇదే రోజు ఉదయం మృతి చెందారు. అప్పల స్వామికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

గత ప్రభుత్వ ఘనత
తీరిన నీటి కొరత



గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేస్తున్న కొత్త పైప్‌లైన్లు



రూ.2.5 కోట్లతో కొత్త పైప్‌లైన్

3వేల ఇళ్లకు సజావుగా నీటి సరఫరా

ప్రజల హర్షం

నాడు

ఆ ప్రాంతాల్లో తాగునీటికి నిత్యం అవస్థలే. పైప్‌లైన్లు పాతవి కావడంతో ఎప్పుడు సరఫరా ఆగిపోతుందో తెలిసేది కాదు. ఇక అప్పటి నుంచి మళ్లీ పైపులకు మరమ్మతులు చేసేవరకు ఇదే పరిస్థితి. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకునేలోపు మరో ప్రాంతంలో పైపులైన్ దెబ్బతినడం.. మళ్లీ నీరు రాకపోవడం.. తరచూ ఇదే సమస్య. చుక్క నీటికీ కటకటలాడాల్సిన పరిస్థితి.

నేడు

ప్రజల ఇబ్బందులు తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2.50 కోట్లు మంజూరు చేసింది. తాగునీటి ఎద్దడి అనే మాటే లేకుండా మంచి నాణ్యత కలిగిన డీఐ పైపులను తగరపువలస నుంచి భీమిలిలోని ట్యాంకుల వరకు వేయించింది. దీంతో సుమారు మూడువేల ఇళ్లకు, 20 పబ్లిక్ కుళాయిలకు నిరంతరాయంగా నీరు సరఫరా అవుతోంది. ప్రజల కష్టాలు తీరాయి.

భీమునిపట్నం: భీమిలి పరిసర ప్రాంతాల్లో మంచి నీటి సరఫరాకు సంబంధించిన ప్రధాన సమస్య కొత్త పైప్‌లైన్ల ఏర్పాటుతో పరిష్కారమైంది. ఇక్కడకు ప్రతిరోజు తగరపువలస పంప్‌హౌస్ నుంచి ప్రధాన పైప్‌లైన్ల ద్వారా భీమిలి కృష్ణాకాలనీ వద్దనున్న ట్యాంక్‌కు 800 కిలో లీటర్ల నీరు, బ్యాంక్‌రోడ్డు వద్దనున్న ట్యాంక్‌లోకి 450కిలో లీటర్ల నీరు సరఫరా జరుగుతోంది. ఇందులో కృష్ణాకాలనీ ట్యాంక్ ద్వారా దాని పరిధిలోని కృష్ణాకాలనీ, చిన్నబజారు, గాడువీధి, కొంకువీధి, తోటవీధి ప్రాంతాలకు అక్కడి ట్యాంక్ ద్వారా నీరు అందుతుండగా.. బ్యాంక్‌రోడ్డు ట్యాంక్ ద్వారా పెద్దబజారు, ఎగువపేట, బోయివీధి, నేరెళ్లవలస కాలనీ ప్రాంతాలకు ప్రతిరోజూ సరఫరా జరుగుతోంది. ఇక్కడ పరిధిలో సుమారు మూడువేల ఇళ్లకు కుళాయిలు ఉండగా, 20 పబ్లిక్ కుళాయిలు ఉన్నాయి.



కృష్ణాకాలనీ వద్ద మంచినీటి ట్యాంక్

గతంలో ఇదీ పరిస్థితి..

గతంలో ప్రతి రోజు అరగంట మాత్రమే నీటి సరఫరా జరుగుతుండేది. అది కూడా సరిగ్గా లేకపోవడం చాలా ఇబ్బందికరంగా ఉండేది. 2009లో తగరపువలస పంప్‌హౌస్ నుంచి భీమిలి ట్యాంక్‌లకు ఉన్న ఏడు కిలోమీటర్ల దూరానికి జీఆర్‌పీ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. కానీ, ఏమాత్రం నాణ్యత లేకపోవడంతో నిత్యం ఏదో ఒకచోట పైప్‌లైన్ పగిలిపోయేది. ఒకసారి పగిలితే దానికి మరమ్మతులు చేయడానికి రెండు, మూడు రోజులు పట్టేది. దీంతో ఇక్కడ ఎవరికీ మంచినీటి సరఫరా ఉండేదికాదు. దీంతో అందరూ నానా అవస్థలు పడేవారు. ప్రతినెలా మూడు, నాలుగు సార్లు ఇదే పరిస్థితి తలెత్తడం పెద్ద సమస్యగా ఉండేది. అసలే అంతంతమాత్రంగా ఉండే సరఫరా, ఈ అంతరాయంతో మరింత అధ్వానంగా మారింది. దీనిపై ప్రజలు అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది.



పబ్లిక్ కుళాయి వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

గత ప్రభుత్వ హయాంలో..

సమస్య తీవ్రతను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు తక్షణ చర్యలు చేపట్టింది. ఇక్కడ కొత్త పైప్‌లైన్ల కోసం రూ 2.50కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో మంచి నాణ్యత కలిగిన డీఐ పైపులను తగరపువలస నుంచి భీమిలిలోని ట్యాంకుల వరకు రెండు సంవత్సరాల క్రితం అధికారులు ఏర్పాటు చేశారు. ఇక అప్పటి నుంచి పైప్‌లైన్ పగిలిపోయే సమస్య ఏర్పడలేదు. సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారమైంది. దీంతో ప్రతిరోజు భీమిలిలోని అన్ని ప్రాంతాలకు నిరాటంకంగా నీటి సరఫరా జరుగుతోంది. గతంలో పబ్లిక్ కుళాయిలపై ఆధారపడిన వారి అవస్థలు వర్ణనాతీతంగా ఉండేవి. కొత్త లైన్లు ఏర్పాటు చేశాక రోజూ సజావుగా నీటి సరఫరా జరగడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ



ఇక్కడ కొత్తగా వేసిన పైప్‌లైన్లను పకడ్బందీగా ఏర్పాటు చేశాం. సరఫరాను నిత్యం పర్యవేక్షిస్తున్నాం. మళ్లీ ఎటువంటి సమస్యలు రాకుండా జాగ్రత్త వహిస్తున్నాం.

–సురేష్, మంచినీటి సరఫరా విభాగం ఏఈ

అప్పట్లో దినదిన గండమే..



మా ప్రాంతంలో చాలా మంది కుళాయి నీటిపైనే ఆధారపడేవాళ్లం. కానీ, ఏ రోజు పైప్‌లైన్ పగిలిపోతుందో.. ఎప్పుడు సరఫరా ఆగిపోతుందో తెలియని పరిస్థితి ఉండేది. అలా ఆగిపోతే నీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడవలసి వచ్చేది. దీంతో అందరికీ దినదిన గండంగా ఉండేది. సమస్య పరిష్కారమవుతుందన్న ఆశలు వదిలేసుకున్న సమయంలో గత ప్రభుత్వం సమస్య పరిష్కరించింది.

–ఎర్నింటి సత్యన్నారాయణ, భీమిలి

నిరాటంకంగా సరఫరా



ఇప్పుడు ఏర్పాటు చేసిన కొత్త పైప్‌లైన్ల వల్ల రోజూ సమయానికి కచ్చితంగా మంచినీటి సరఫరా జరిగిపోతోంది. ఇది అందరికి ఎంతో సదుపాయంగా ఉంటోంది. ఎప్పుడు సరఫరా ఆగిపోతుందో నన్న ఆందోళన పోయింది. గత ప్రభుత్వ సహకారాన్ని మరువలేం.

– తుమ్మి ఆదిలక్ష్మి, భీమిలి

గిరిజన మంత్రిత్వశాఖ డైరెక్టర్ సందర్శన

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణ మిషన్ (టీసీఆర్‌టీఎం) భవన్‌ను గిరిజన మంత్రిత్వ శాఖ సంచాలకులు సమిధా సింగ్ మంగళవారం ఉదయం సందర్శించారు. ముందుగా మిషన్ భవన్ కార్యాలయాన్ని పరిశీలించిన ఆమె, అనంతరం అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ మిషన్ వార్షిక కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న జాతీయ స్థాయి గిరిజన ఆర్చరీ పోటీల ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ మిషన్ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీసీఆర్‌టీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.రాణిమందా, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న గిరిజన మంత్రిత్వ శాఖ సంచాలకులు సమిధా సింగ్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు శ్రీనగర్ కాలనీలో సోమవారం రాత్రి నిర్మాణంలో ఉన్న డాబాపై ఆరబెట్టిన దుస్తులు తీస్తుండగా విద్యుత్ తీగలు తగిలి నిమ్మకాయల శ్రీను(59) అనే వ్యక్తి మృతి చెందాడు. డాబాపై ఉన్న విద్యుత్ తీగలు తగిలిన శ్రీను ఇంటి ముందు సీసీరోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే భార్య కాసులమ్మ, బావమరిది చెన్నా అప్పలరాజు, నిమ్మకాయల ఎల్లారావు తదితరులు చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుని భార్య కాసులమ్మ తగరపువలస ప్రైవేట్ మార్కెట్‌లో పండ్లు విక్రయిస్తుండగా శ్రీను సహాయం చేస్తుండేవాడు. కాసులమ్మ ఫిర్యాదు మేరకు భీమిలి హెడ్ కానిస్టేబుల్ ఆర్పీ త్రినాథ్ దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు నిమ్మకాయల శ్రీను

యోగోత్సవం

యోగా డే కౌంట్‌డౌన్ @ 74



యోగాసనాలు వేస్తున్న సాధకులు

కొమ్మాది: 600 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు, యోగా సాధకులు, భారత నేవీ, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఆయుష్‌శాఖ, అంగన్‌వాడీ, స్థానిక సంస్థల ప్రతినిధులు యోగాభ్యాసాలతో ఆ ప్రాంతంలో సందడి నెలకొంది. ఆయుష్ మంత్రిత్వశాఖకు చెందిన మొరార్జీదేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక 100 డేస్, 100 సిటీస్, 100 ఆర్గనైజేషన్స్ యోగా ప్రాజెక్టులో భాగంగా 2025 అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 74వ కౌంట్‌డౌన్ డేను గీతంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని విశాఖ ఆయుష్ ప్రాంతీయ డైరెక్టర్ డా.ఝాన్సీరాణి ప్రారంభించారు. అందరూ శ్రద్ధగా యోగాసనాలు వేశారు.

మొక్కుబడిగా ఆక్రమణల తొలగింపు

- రూ. 5 కోట్ల పార్కు, రోడ్డు స్థలం ఆక్రమణ
- సాక్షి వివరణ కోరే ప్రయత్నం చేయగా పాక్షికంగా తొలగింపు

మధురవాడ: జీవీఎంసీ అధికారుల ఉదాసీనతతో ఇద్దరు వ్యక్తులు రూ. 5కోట్లు విలువ చేసే వెయ్యి గజాల స్థలం ఆక్రమణకు భారీ స్కెచ్ వేశారు. విశాఖ రూరల్ మండలం మధురవాడ జోన్ 5వ వార్డు అయోధ్యనగర్‌లో సర్వే నెం.72/పి, 73పిలో గల ఫారెస్టు లే అవుట్.. సర్వే నెం.70, 71లో ఉన్న లచ్చిరాజు లే అవుట్ మధ్యలో గల సుమారు 850 గజాల స్థలాన్ని పీఎం పాలేనికి చెందిన రమేష్ అనే వ్యక్తి ఆక్రమించాడు. రుషికొండకు చెందిన సమ్మరి అప్పలరాజు అనే మరో వ్యక్తి ఈ ప్రాంతంలో తాపీ పనులు నిర్వహించినట్టు ప్లానింగ్ సెక్రటరీ లోకేష్ ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్టు చెప్పారు. పక్కనే సర్వే నెం.80లో ఉన్న మరో 150 గజాల వుడా ప్లాన్‌లో రోడ్డుగా చూపించిన స్థలానికి మరో వ్యక్తి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి మరీ ఆక్రమణకు తెర తీశాడు. దీనిలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను అధికారులు తొలగించారు. జోన్–2లో సుమారు రూ. 5కోట్లు విలువైన 1000గజాల మేర పార్కు, రోడ్డు స్థలాల ఆక్రమణ వ్యవహారంపై ఏసీపీ తిరుపతి రావు, టీపీవో బాలరాజులను వివరణ కోరే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు. అయితే ప్లానింగ్ సెక్రటరీ లోకేష్ ద్వారా హడావుడి చేయించి పాక్షికంగా ప్రహరీ తొలగించారు. హెచ్చరిక బోర్డు మాత్రం ఏర్పాటు చేయలేదు.



రోడ్డు స్థలంలో తొలగించిన ఫెన్సింగ్

విద్యార్థులకు అభినందన

తగరపువలస: ఇటీవల విడుదలైన ఆంధ్ర విశ్వవిద్యాలయం డిగ్రీ మొదటి సంవత్సర పరీక్ష ఫలితాలలో చిట్టివలస శ్రీకృష్ణా డిగ్రీ కళాశాల విద్యార్థులు ముందంజలో నిలిచారు. భీమిలి, నెల్లిమర్ల నియోజకవర్గాల పరిధిలోని ఆరు మండలాలలో ఉన్నత ఫలితాలు సాధించినట్టు శ్రీకృష్ణా విద్యాసంస్థల చైర్మన్ బి.నరసింగరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. బీఎస్సీ (ఆనర్స్) కెమిస్ట్రీలో దల్లి రామశ్రీను 10 పాయింట్లకు గాను 9.05, డి.సరస్వతి 8.85 పాయింట్లు, డి.వరలక్ష్మి 8.60 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచారన్నారు. వారితో పాటు విశ్వవిద్యాలయ పరిధిలో 50 మంది విద్యార్థులు 8కి పైగా పాయింట్లు సాధించి మొత్తంగా 95 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జరజాపు సతీష్ కుమార్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీకృష్ణా విద్యాసంస్థల చైర్మన్ నరసింగరావు

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: వేసవిలో తాగునీటి కొరత రాకుండా చూడాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పద్మనాభం మండల సర్వ సభ్య సమావేశంలో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీపీ మాట్లాడుతూ ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

- వెంకటాపురం సర్పంచ్ కె.రమణ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద కుళాయిలను ఇంటింటికి వేయాల్సి ఉండగా, వీధిలో వేస్తున్నారని తెలిపారు. వీధిలో వేయడం వల్ల వాహనాలు ఢీకొనడంతో ఇవి పోతున్నాయన్నారు.
- శేరిఖండం సర్పంచ్ పల్లంటి చిన్నారావు మాట్లాడుతూ రెడ్డిపల్లి రోడ్డు విస్తరణలో భాగంగా తాగునీటి పైపులైన్ పోయి మూడేళ్లు కావస్తున్నా, దీన్ని పునర్నిర్మించలేదని తెలిపారు. దీనివల్ల రెడ్డిపల్లి, శేరిఖండం గ్రామాల్లో కుళాయిల ద్వారా నీరు రాక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ రెండు గ్రామాల్లో ఈ నెల 13 నుంచి 15 వరకు బంగారమ్మ పండగ ఉందని, పండగకు వచ్చే బంధువులకు కనీసం తాగునీరు కూడా ఇవ్వలేని పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. పైపులైను పునరుద్ధరణ కోసం అటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గాని, ఇటు ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోలేదని సభ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై ఎంపీపీ రాంబాబు స్పందిస్తూ ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే పైపులైన్‌ను పునరుద్ధరించకపోతే రెండు శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.
- గంధవరం సర్పంచ్ జి.వి.కె.కె.వర్మ మాట్లాడుతూ తమ గ్రామంలో ఉపాధి హామి పథకం పనులు చేపడుతున్నప్పుడు ఎన్ఆర్‌ఈజీఎస్ అధికారులు తమకు తెలియజేయలేదన్నారు. ఎంపీడీవో విజయ్ కుమార్ మాట్లాడుతూ గంధవరంలో కుళాయిల ద్వారా బురద నీరు వస్తుందని తన దృష్టికి వచ్చిందని, ఇది పునరావృతం కాకూదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి స్వప్న, ఏవో ఎంపీఎస్ చలం, వెలుగు ఏపీఎం సాయి రమేష్, ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ రాంబాబు

ఘనంగా పైడితల్లమ్మ అనుపోత్సవాలు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి, శింగనబంధ, నారాయణరాజుపేట, మజ్జిపేట, కరగానిపేట, అల్లుపేట తదితర గ్రామాలలో జరుగుతున్న గ్రామదేవత వార్షిక ఉత్సవాలలో భాగంగా పైడితల్లమ్మకు మంగళవారం అనుపోత్సవం నిర్వహించారు. ఆయా గ్రామాల ఆలయాలలో ఉదయం నుంచే భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పాలధార, రథోత్సవం, బాణసంచా, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య అనుపోత్సవం నిర్వహించారు. భీమిలి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



శింగనబంధలో పైడితల్లమ్మ



దాకమర్రిలో నిర్వహిస్తున్న రథోత్సవం

హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

తగరపువలస: ఈ నెల 12న ఆనందపురం కూడలి నుంచి హనుమాన్ విజయోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న ద్విచక్రవాహనాల ర్యాలీ, హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు కోరారు. విజయనగరంలోని ఆయన ఇంటి వద్ద మంగళవారం పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆనందపురం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, బాలి రవి, జీరు కైలాష్‌రెడ్డి, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న మజ్జి శ్రీనివాసరావు

గోరుచుట్టుపై రోకలిపోటులా గ్యాస్‌ధర పెంపు

తగరపువలస: అసలే చుక్కలను తాకుతున్న నిత్యావసర సరకుల ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులపై వంట గ్యాస్ ధర పెంపు గోరుచుట్టుపై రోకలిపోటులా ఉందని భీమిలి డివిజన్ సీపీఐ నాయకులు పేర్కొన్నారు. వెంటనే పెంచిన వంట గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కానూరి రాంబాబు, మోర అప్పలరాజు తదితరులు మాట్లాడారు. ధరలు తగ్గించకపోతే ప్రజల తరఫున నిరసనలు తెలియజేస్తామన్నారు. నాయకులు లక్ష్మణరావు, అప్పారావు, ముత్యాలరావు పాల్గొన్నారు.

ఆనందపురం 'ఏఈఈ'గా అప్పలనాయుడు

తగరపువలస: ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈఈగా మండల అప్పలనాయుడు పీఎం పాలెం సబ్‌స్టేషన్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏఈఈగా పని చేసిన సురేష్‌కుమార్ డిప్యూటీ ఈఈగా అనకాపల్లి జిల్లా మాడుగుల సబ్ డివిజన్ ఆఫీసుకు పదోన్నతిపై బదిలీ అయ్యారు.

డిగ్రీ కళాశాలకు ప్రత్యామ్నాయ వసతి చూడాలి

ఎస్ఎస్ఏ ఏపీసీ చంద్రశేఖరరావు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌లో టైప్–4 కేజీబీవీ కోసం నిర్మించిన భవనంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రత్యామ్నాయ వసతి చూసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ జోగ చంద్రశేఖరరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణికి సూచించారు. చిట్టివలసలోని బాలికల, బాలుర జెడ్పీ హైస్కూళ్లను మంగళవారం ఆయన సందర్శించారు. టైప్ – 4 కేజీబీవీని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు జెడ్పీ హైస్కూల్‌లో పీఎం శ్రీ నిధులతో జరుగుతున్న ఆటస్థలాన్ని పరిశీలించి సూచనలు చేశారు. కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు డబ్ల్యూఎస్ఎస్ ఆర్గనైజేషన్ ద్వారా వచ్చిన ల్యాబ్ పరికరాలను పరిశీలించారు. ఎస్ఏ–2 పరీక్షలు జరుగుతున్న తరగతి గదులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బాలికల జెడ్పీహైస్కూల్‌లో కూడా పర్యటించి ఉపాధ్యాయులతో పాఠశాల అభివృద్ధి గురించి మాట్లాడి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఎంవో లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు ఎన్.సూర్యనారాయణ, సీహెచ్ రోజామణి, వ్యాయామ ఉపాధ్యాయుడు చిల్ల వెంకటరెడ్డి, సైట్ ఇంజినీర్ మహాలక్ష్మి, సీఆర్పీ త్రినాథ్ తదితరులున్నారు.



చిట్టివలస జెడ్పీహైస్కూల్‌లో ల్యాబ్ పరికరాలను పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ ఏపీసీ చంద్రశేఖరరావు

రోడ్డు విస్తరణ నిలిపివేయాలి

తగరపువలస: ఆనందపురం మండలంలోని భీమిలి క్రాస్ రోడ్డు నుంచి భీమిలి గొల్లలపాలెం వరకు చేపట్టనున్న రహదారి విస్తరణ పనులు నిలిపివేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆనందపురం తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో రైతులు, వ్యాపారులు, ప్రజలు మంగళవారం ఆందోళన చేపట్టారు. భీమిలి డివిజన్ సీపీఎం కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో ఈ రహదారిని 200 అడుగుల వెడల్పుతో విస్తరించడానికి స్థానికులకు నోటీసులు జారీ చేశారన్నారు. అంత విశాలమైన రహదారి అవసరం లేదని స్థానికులు అభ్యంతరం తెలుపుతున్నారన్నారు. ఈ మార్గంలో ఇరువైపులా 200 మంది వరకు చిరు వ్యాపారులు జీవనం సాగిస్తున్నారని, ఇప్పుడు వీరంతా రోడ్డున పడతారన్నారు. ఈ విస్తరణ 100 అడుగుల లోపే ఉండాలని, అప్పటి వరకు వీరికి అండగా ఉంటామని తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ చైతన్యకుమార్‌కు వినతిపత్రం అందించారు. ఆందోళనలో నాయకులు కె.నాగరాణి, ఆర్.వీరన్న, ఎస్.శంకర్, జి.రమణి, సీహెచ్ అమ్మాజీ, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఆనందపురం డీటీ చైతన్యకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు